ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.6
కనిష్ఠం 17.8
ANDHRAJYOTHY
యాదాద్రి
భువనగిరి
5
గురువారం 28 నవంబరు 2024



నృసింహుడికి వైభవంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య పూజలు, సత్యదేవుని వ్రతాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 7





నల్లగొండ జిల్లాకేంద్ర ఆస్పత్రిలో క్యూకట్టిన రోగులు

తేదీ	కనిష్ఠ ఉష్ణోగ్రత
20	19.0
21	18.8
22	18.4
23	19.0
24	19.4
25	19.2
26	18.0
27	17.8

ఇంటికో రోగి

- వారం రోజులుగా చల్లగా మారిన వాతావరణం
- జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడుతున్న జనం
- కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు
- వైద్యంతో పాటు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



నల్లగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఇంటికో వ్యక్తి అనారోగ్యం బారిన పడటంతో రోగులతో ఆసుపత్రులు నిండిపోతున్నాయి. ప్రధానంగా వారం రోజులుగా వాతావరణం చల్లబడి, చలి గాలులు పెరగడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జలుబు, జ్వరం, దగ్గుతో బాధపడే రోగులు ఎక్కువయ్యారు. చిన్నపిల్లలు, రోగులు, అస్తమా బాధితులు, వృద్ధులు మరింత ఇబ్బందులకు లోనవుతున్నారు. వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉన్నట్టుండి గణనీయంగా పడిపోవడంతో ఇంటింటికీ రోగాలు ముసురుకున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20వ తేదీ నుంచి 19 డిగ్రీలకంటే తక్కువగానే నమోదవుతున్నాయి. అతిచల్లటి వాతావరణం కొనసాగుతోంది. ఈ వాతావరణంతో రోగుల సంఖ్య పెరిగి జిల్లా కేంద్ర ప్రధానాసుపత్రితో పాటు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆసుపత్రులకు రోగుల

- మిగతా 6వ పేజీలో...

సాగునీటి కాల్వలపై నజర్



పిలాయిపల్లి కాల్వ

మూసీ నది

వర్షాకాలంలో మూసీలో ప్రవహించే ఎగువ వరద నీటిని వినియోగించుకునేందుకు కాల్వల నిర్మాణానికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. మూసీ పరివాహక ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన బునాదిగాని, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వల నిర్మాణ పనులు ఇప్పటివరకు అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. ఆరుగురు ముఖ్యమంత్రులు మారినా పనులు పూర్తికాకపోవడం పై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు తమ కష్టాలు తొలగిపోతాయనే ఆశలో ఉన్నారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- 20 ఏళ్లుగా పెండింగ్‌లోనే పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పనులు
- బునాదిగాని కాల్వ పునరుద్ధరణకు ఇటీవల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- మిగతా వాటికి నిధులు మంజూరు చేయాలని విన్నపం
- త్వరలోనే పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు నిధులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బునాదిగాని కాల్వ పునరుద్ధరణకు రూ.200కోట్లకుపైగా మంజూరు చేసింది.పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు కూడా వెంటనే నిధులు మంజూరు చేయాలని రైతులు ప్రజాప్రతినిధుల దృష్టికి తెస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని సమాధానం ఇస్తున్నారు. అయితే పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనుల నిధుల మంజూరుకోసం స్థానిక ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితోపాటు సాగునీటి, ఆర్థిక మంత్రిని సంప్రదిస్తున్నారు. భారీ సాగునీటి ప్రాజెక్టులకోసం నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడంలేదు. చిన్ననీటి పారుదల ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఈమేరకు సాగునీటి శాఖ కూడా చిన్న నీటి పారుదలకు సంబంధించిన పెండింగ్ పనులపై ప్రతిపాదనలు పంపాలని కోరింది. ఈనేపథ్యంలో జిల్లాలోని బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణ పనులపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపింది. అయితే ఆర్థిక శాఖ మాత్రం బునాదిగాని కాల్వ పునరుద్ధరణ పనులకోసం మాత్రమే నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మిగతా రెండు కాల్వలకు కూడా నిధులు మంజూరయ్యేలా భువనగిరి, ఆలేరు, నకిరేకల్, మునుగోడ ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. సాగునీటి పునరుద్ధరణ పనులకు మంజూరు ఇచ్చినట్లయితే పనులు కొనసాగేలా బాధ్యత తాము తీసుకుంటామని మంత్రుల వద్ద ఎమ్మెల్యేలు విన్నవిస్తున్నారు. అయితే ఆర్థిక పరిస్థితులను బట్టి నిధుల మంజూరుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సంబంధిత మంత్రులు కూడా హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఏళ్లుగా పెండింగ్‌లోనే పనులు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాల్లో

- మిగతా 6వ పేజీలో...

పాస్‌పుస్తకాలు అందేదెప్పుడో?

● బ్యాంకు రుణాల కోసం రైతుల నిరీక్షణ ● కుటుంబ సర్వేలోనూ తప్పిన లెక్క ● తలపట్టుకుంటున్న రైతులు



పట్టాదార్ పాస్ పుస్తకాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి కోసం రుణాలు తీసుకునేందుకు బ్యాంకులకు వెళితే పాస్ పుస్తకం అడుగుతుండడంతో దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్ అయ్యాక 15రోజుల్లో రావాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాలు నెలల తరబడి రాకపోవడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు) 7

సర్వర్ డౌన్.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో క్రయవిక్రయదారుల ఇబ్బందులు



స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్‌తో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రస్థాయిలో రిజిస్ట్రేషన్‌శాఖలో చలాన్ల వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో చలాన్లు కట్టుకోవడానికి సమస్యలు ఎదురయ్యాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ఉమ్మడి జిల్లాలో కనీసం 40 డాక్యుమెంట్లు కూడా రిజిస్ట్రేషన్ కాలేదని సమాచారం. గత కొద్ది రోజుల క్రితం కూడా ఇదేవిధంగా సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ) 7

న్యూస్ బాక్స్

తెగుళ్ల నివారణకు చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్ట్ సర్వేలైన్స్ సిస్టమ్ ద్వారా పంటలకు సోకే తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఎన్‌పీఎస్ఎస్ యాప్ గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పంటలకు ఆశించిన తెగుళ్లను సులభంగా గుర్తించి నివారణ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు ఆర్.నవీత, వెంకటరెడ్డి, బసవన్నెప్ప, శ్వేత, వనిత తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి



రాజాపేట మండలం రేణుకుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రాజాపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం రాజాపేట మండలంలోని రేణుకుంట గ్రామంలో ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. తూకాలు, కొనుగోలు వివరాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు జడ్పీ ప్రత్యేక సమావేశం

భువనగిరి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు కలెక్టర్ హనుమంతరావు అధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చేపడుతున్న సామాజిక విద్య, ఉద్యోగ, కుటుంబ సర్వే ప్రగతి, వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు, జిల్లాలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై సమావేశంలో సమీక్షించనున్నట్లు వివరించారు. జిల్లా అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలన్నారు.

7 **నేటి నుంచి డిగ్రీ పరీక్షలు యథాతథం**

● ఎంజీయూ సీవోఈ ఉపేందర్‌రెడ్డి

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



సంస్థాన్‌నారాయణపురంలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు భోజన విషయంలో రుచి, శుచి, శుభ్రత పాటించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం సంస్థాన్‌నారాయణపురంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 'హాస్టల్‌నిద్ర' చేశారు. సాయంత్రం హాస్టల్‌కు చేరుకున్న కలెక్టర్ విద్యార్థులను పలకరించి వారికి అందిస్తున్న భోజనం, రోజువారి దినచర్య గురించి ఆరా తీశారు. హాస్టల్ పరిసరాలను, వంట గదిని, కూరగాయలను, మెనూ, విద్యార్థులుండే గదులను, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. వంట గదిని పరిశీలించి వంటచేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 89 హాస్టళ్లకు ప్రత్యేకాధికారులను నియమించి హస్టల్‌నిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాసిరకం బియ్యం, కూరగాయలు, ఇతర ఆహారపదార్థాలు సరఫరా చేసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు అందించే భోజన విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఏ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టంచేశారు. అనంతరం విద్యార్థులతో భోజనంచేస్తూ వారి విద్యా విధానంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన సలహాలు, సూచనలు విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుతున్న నిరుపేద విద్యార్థులను మన బిడ్డలుగా భావించి వారిని మరింత జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందున కలెక్టర్ విద్యార్థులకు దుప్పట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి జైపాల్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో నరసింహరావు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం

'హాస్టల్ నిద్ర'లో కలెక్టర్ హనుమంతరావు

నాణ్యమైన భోజనాన్ని అందించడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా పరిషత్ సీఈవో ఎస్.శోభారాణి అన్నారు. భువనగిరిలోని షెడ్యూల్ తెగల బాలికల వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

భువనగిరి టౌన్: ప్రభుత్వ హాస్టళ్ల పనితీరును మెరుగు పర్చడం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతులు కల్పించే లక్ష్యంతో అధికారులు హస్టల్‌నిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు బుధవారంరాత్రి పట్టణంలోని అన్ని హాస్టళ్లను అధికారులు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. హాస్టల్ నిద్ర చేసిన వారిలో డీఎంహెచ్‌వో మనోహర్, సీపీవో శామ్యూల్, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నర్మద, ఉమారాణి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : నర్సిరెడ్డి

మోటకొండూరు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గంధమల్ల విశ్వరూపం, సుదర్శన్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనంలో నాణ్యత పాటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. యాదగిరిగుట్ట మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఆయనవెంట మెతుకు సైదులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కేజీబీవీలో కనీస వేతనాలు చెల్లించాలి



కేజీబీవీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తుర్కపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించాలని మోడల్ స్కూల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిలివేరు మహేశ్ కోరారు. తుర్కపల్లి మండలం రామపురం కేజీబీవీలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, వర్కర్స్ భోజన సమయంలో నల్లబ్యాడ్జీలతో నిర్వహించిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. రెగ్యులర్ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలన్నింటినీ కేజీబీవీ టీచర్లకు కల్పించాలన్నారు. కేజీబీవీలలో పని చేస్తున్న ఎస్‌వోలు, సీఆర్టీలు, ఇతర నాన్ టీచింగ్ వర్కర్స్‌తో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందే తప్ప వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఎస్టీఎఫ్ జిల్లా కోశాధికారి ఇటికాల మల్లేశం, మండల శాఖ అధ్యక్షుడు పెద్ది బిక్షమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల లక్ష్మి, ఎస్‌వో అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, చిత్రంలో దివీస్ జనరల్ మేనేజర్ సుధాకర్

సంస్థాన్‌నారాయణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామంలోని గురుకుల పాఠశాలలో రూ.18.61 కోట్లతో నిర్మించిన నూతన పాఠశాల భవనం, ఆడిటోరియం, కిచెన్, డైనింగ్ హాల్ భవన సముదాయాల ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించగా, ఆడిటోరియాన్ని దివీస్ పరిశ్రమ జనరల్ మేనేజర్ సుధాకర్, కిచెన్ భవనాన్ని గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి రమణ కుమార్, హాస్టల్ భవనాన్ని పూర్వ విద్యార్థి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బడి గుడితో సమానం అని అన్నారు. దేశంలోనే సర్వేల్ పాఠశాలకు ఉన్నతమైన చరిత్ర ఉందన్నారు. డబ్బుతో గౌరవం రాదని, విద్యతోనే వస్తుందన్నారు. చదువు ఒక ఆయుధం, దాన్ని ఎవరూ దొంగిలించలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో విద్యకోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. సర్వేల్ పాఠశాల ఆవరణలో త్వరలోనే ఇంకో డార్మెటరీ హాల్ నిర్మాణం చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మునుగోడు నియోజకవర్గంలో మండలానికి ఐదు పాఠశాలల చొప్పున 30 పాఠశాలలను నిర్మించేలా కృషి చేస్తానన్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని

గురుకుల పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి రమణ కుమార్ అన్నారు. ఆధునిక వసతులతో నూతన భవనం నిర్మించినప్పటికీ ఫర్నిచర్ లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ నేటి ఆధునిక గురుకులాల ఏర్పాటుకు సర్వేల్ స్ఫూర్తిదాయకమన్నారు. అలుమిని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బూడిద నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ తమ ఉన్నతికి కారణమైన ఈ పాఠశాల అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు కోటి రూపాయలు వెచ్చించి ఫర్నీచర్ సమకూర్చిన దివీస్ పరిశ్రమ జనరల్ మేనేజర్ సుధాకర్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణ, గురుకుల విద్యాలయ సంస్థ డిప్యూటీ కార్యదర్శి కేవీఎన్ ప్రసాద్, అలూమినీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుత్తా ఉమాదేవి, మాజీ జడ్పీటీసీలు భానుమతి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక, వేధింపుల బాధితులకు

భరోసా



లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, బాలికల కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రతి నిత్యం ఏదో ఒకచోట మహిళలు, బాలికలపై దాడులు జరుగుతున్నాయి. అయితే బాధితుల కోసం ప్రత్యేక చట్టాలున్నప్పటికీ వారికి సరైన సలహా, భరోసా కల్పించేవారు కరువయ్యారు. ఈ క్రమంలో బాధితుల సహాయార్థం గత ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ కేంద్రాలు మహిళలు, బాలికలకు మానసికంగా ధైర్యం, వైద్య సదుపాయం, న్యాయ సలహాలు అందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పటికే సఖి కేంద్రాలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను నిర్వహిస్తోంది. మూడేళ్ల కిందట జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ప్రారంభించగా ఇప్పటి వరకు 317 కేసుల్లో బాధితులకు అండగా నిలిచారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

సమాజంలో అన్యాయానికి గురైన మహిళలు, బాలికలకు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు మొదలుకొని వారికి న్యాయం జరిగే వరకు భరోసా కేంద్రం సేవలందిస్తోంది. కేసులు నమోదు విషయంలో తప్పులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. బాధిత మహిళలకు జరిగిన అన్యాయాన్ని పోలీస్‌స్టేషన్లలో చెప్పాలంటే కొంతఇబ్బంది పడుతుంటారు. ఆ సమయంలో భరోసా కేంద్రంలో ఉండే మహిళా పోలీస్ అధికారి సమక్షంలో మహిళలు వారి బాధలను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశముంది. ఆ తర్వాత కోర్టుకు వెళ్లినపుడు న్యాయ సలహాలు ఇస్తున్నారు. అదేవిధంగా శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్న వారికి భరోసా కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తున్నారు. అనంతరం వారికి మనోధైర్యం కల్పించేందుకు సైకాలజిస్ట్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఒక వేళ బాధిత మహిళలకు వైద్యసేవలు అవసరమైతే వెంటనే వైద్య సదుపాయం అందిస్తున్నారు. నిరాదరణకు గురైన వారికి ఆదరణ కల్పిస్తున్నారు.

మొత్తం మహిళలతోనే కేంద్రం నిర్వహణ

సూర్యాపేటలో మూడేళ్ల క్రితం రాష్ట్ర పోలీస్ మహిళా శిశు భద్రత విభాగం ఆధ్వర్యంలో భరోసా కేంద్రం ప్రారంభమైంది. ఈ కేంద్రంలో లీగల్ అడ్వయిజర్, సైకాలజిస్ట్, డెటాఎంట్రీ ఆపరేటర్, కేర్‌టేకర్, ఏఎన్ఎం, ముగ్గురు పోలీస్ అధికారులు, కౌన్సెలింగ్ సిబ్బంది మొత్తం కూడా మహిళలే ఉంటారు. ఈ కేంద్రం ఏర్పాటుకు స్థానిక సువెన్‌లైఫ్ సైన్సెస్ ఆర్థిక సాయం అందించింది. పట్టణ శివారులో సువెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ప్రాంగణంలో సుమారు రూ.40లక్షలతో భరోసా కేంద్రానికి పక్కా భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి అక్కడే సేవలందిస్తున్నారు.

సూర్యాపేటలోని భరోసా కేంద్రం

> **317 కేసుల్లో సహకారం**
>
> సూర్యాపేట భరోసా కేంద్రానికి ఇప్పటివరకు 317 కేసులు వచ్చాయి. అందులో బాలలపై లైంగిక వేధింపులు, మిస్సింగ్ కేసులు 95, మెడికల్ సాయం అందించింది 80 మందికి, ఐదుగురికి పునరావాసం కల్పించడం, మరో 137 మంది బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

> **బాధిత మహిళలకు భరోసా కల్పిస్తున్నాం**
>
> 
>
> ఏదైనా సందర్భాల్లో అన్యాయానికి గురైన మహిళలు, బాలికలకు భరోసా కేంద్రం ద్వారా ధైర్యం, పునరావాసం, న్యాయ సలహాలు అందిస్తున్నాం. సూర్యాపేట భరోసా కేంద్రంలో ఇప్పటికే 300 మందికి పైగా సేవలందించాం. మహిళల రక్షణ విషయంలో పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగినపుడు నేరుగా డయల్-100 ఫోన్ చేయాలి.
>
> - సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, సూర్యాపేట

జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు తేజ విద్యార్థులు ఎంపిక

కోదాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కొమరబండ తేజ విద్యాలయ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. బుధవారం సాలార్జంగ్ మ్యూజియంలో ఇంటాక్ సంస్థ వారు తెలంగాణ రాష్ట్రస్థాయి తుదిపోటీలు నిర్వహించారన్నారు. ఈ పోటీలకు ఎంపిక చేసిన వరంగల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్ సూర్యాపేట జిల్లాలకు చెందిన తుది 4 జట్లకు దృశ్య, శ్రవణ మాధ్యమాల్లో తెర మీద ప్రశ్నలతో క్విజ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్ పోటీ నిర్వహించారన్నారు. తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి నోముల సృజన్‌గుప్తా, 8వ తరగతి విద్యార్థి ధరావత్ నితీశ్‌రాజ్ జట్టు 37.5 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విజేతలకు తెలంగాణ ఇంటాక్ కన్వీనర్ అనురాధారెడ్డి ట్రోఫీలు అందించినట్లు తెలిపారు. డిసెంబరు 21న న్యూఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి తుది పోటీలకు విద్యార్థులు సృజన్, నితీశ్‌రాజ్‌లు ప్రాతినిధ్యం వహిస్తారని అనురాధారెడ్డి తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రమా, డైరెక్టర్ సోమిరెడ్డిలు అభినందించారు.



తేజ విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న నిర్వాహకులు

శిలాఫలకంపై దాశరథి పద్యాలను పొందుపరచాలి

దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేస్తున్న తెలంగాణా తల్లి విగ్రహ శిలాఫలకంపై మహాకవి దాశరథి రచించిన పద్యాలను పొందుపర్చాలని మహాకవి దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణా సాహిత్య అకాడమీ కన్వీనర్ నామోజు బాలాచారికి వినతిపత్రం అందజేశారు. కవిగా, సినిమా పాటల రచయితగా, కథా నవలా రచయితగా తెలంగాణ కోసం దాశరథి చేసిన రచనలు, సాహిత్య ప్రస్థానం కడవరకూ ప్రజల పక్షాన నిలబెట్టిందన్నారు. తెలంగాణను తల్లిగా కొనియాడిన తొలివ్యక్తి దాశరథి అని పేర్కొన్నారు. అలాంటి మహాకవికి సముచిత గౌరవం ఇవ్వాలన్నారు. ప్రవీణ్‌రెడ్డి వెంట దాశరథి కుటుంబ సభ్యులు ఇందిర, గౌరీశంకర్, శతజయంతి ఉత్సవ కమిటీ కార్యవర్గం అనంతోజు మోహన్‌కృష్ణ, ఎడవల్లి సైదులు, పల్లె సతీశ్ ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రవీణ్‌రెడ్డి, ఇతరులు

ఇంటికో రోగి

(5వ పేజీ తరువాయి)

తాకిడి పెరిగింది. జిల్లా కేంద్ర ఆసుపత్రికి నాలుగైదు రోజులుగా రోగుల తాకిడి మరింత పెరిగింది.



సూర్యాపేటలో ఉన్నిదుస్తుల దుకాణం

పెరిగిన బాధితులు

వాతావరణ మార్పులు, అపరిశుభ్రవాతావరణం కారణంగా రోగాలు, వ్యాధులు ప్రబలుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. జ్వరమే కదా అని కొందరు సొంత వైద్యం పాటిస్తుండటంతో పాటు స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్సలు చేయించుకుంటున్నారు. పరిస్థితి విషమించిన తర్వాత ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తోన్న రోగులు వేలాది రూపాయలు వదిలించుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో వైద్యమందిస్తున్నప్పటికీ రోగులకు సంతృప్తకరస్థాయిలో వైద్యం అందడంలేదు. అదేవిధంగా నల్లగొండ జిల్లా ప్రధానాసుపత్రిలోనూ సరైన వైద్యసేవలు అందడం లేదని, నామ్‌కే వాస్తేగా ఓపీ రాస్తున్నారని, పరీక్షలు చేయడం లేదని, మాత్రలతో సరిపుచ్చుతున్నారని రోగులు వాపోతున్నారు.

రోగులతో ఆసుపత్రులు కిటకిట

వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలిన నేపథ్యంలో జిల్లాలో ఆసుపత్రులన్నీ వారం రోజులుగా రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని పీహెచ్‌సీలకు గత వారం రోజులుగా రోగుల తాకిడి పెరిగింది. ఏరియా ఆసుపత్రుల్లో, పీహెచ్‌సీలలో సగటున రోజుకు 3,500 వరకు ఓపీ వస్తోందని, అదేవిధంగా ఏరియా ఆసుపత్రులున్న మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, సాగర్ ఆసుపత్రులకు సైతం ఒక్కో ఆసుపత్రికి రోజుకు 1,500వరకు ఓపీ వస్తోందని డీఎంహెచ్‌వో వెల్లడించారు. జిల్లా కేంద్ర ప్రధానాసుపత్రిలోనూ ప్రతిరోజూ ఈ వారం నుంచి 2వేలకు పైగా ఓపీ నమోదవుతుందని చెబుతున్నారు.

చిన్నారులు జరభద్రం

సూర్యాపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి)/భువనగిరి రూరల్ : చిన్నారులు చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమాత్రం అలసత్వం కనబర్చినా జలుబు, దగ్గు, జ్వరం వచ్చే అవకాశం ఉంది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చిన్నారులకు రోగ నియంత్రణ శక్తి తక్కువగా ఉంటుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చిన్నారులు ఇబ్బందిపడే అవకాశం ఉంటుంది. సూర్యాపేట జిల్లాలో ఆరేళ్లలోపు చిన్నారులు 1,16,526 మంది ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చలితీవ్రత నేపథ్యంలో ప్రతి ఒక్కరూ బయటికి వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, గ్లోవ్స్ ధరించాలి. ఉదయం, సాయంత్రం నడకకు బదులుగా ఇంటి వద్ద యోగా, చిన్నచిన్న వ్యాయామాలు, సైక్లింగ్, ట్రెడ్ మిల్లుపై వాకింగ్ చేసుకోవాలి. చలికాలం ముగిసే వరకు సమతుల ఆహారం తీసుకోవాలి. తేలికపాటి, త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. అవి కూడా వేడివేడిగా ఉంటనే తినాలి. శీతల పానీయాలు, మద్యం, కాఫీ తాగొద్దు. వెచ్చగా ఉన్న నీరు తాగాలి. వెచ్చని నీటితో స్నానం చేయాలి. చల్లని గాలుల వల్ల బ్యాక్టీరియాలు శరీరంపై ఆవాసం చేసుకేనే అవకాశం ఉంది. తరుచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. సైనస్‌తో బాధపడే వారు, డస్ట్ ఎల్జరీ ఉన్న వారు ముక్కుకు రుమాలు కట్టుకోవాలి.

● పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

చలికాలంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వాతావరణంలో మార్పులు, చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతో పాటు శ్వాసకోశ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం, న్యూమోనియా వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. యాంటిబయోటిక్స్ ఎక్కువగా తీసుకుంటే సహజ రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

డాక్టర్ కేఎల్ఎన్ ప్రసాద్, ఎంబీబీఎస్, ఎంఎస్ జనరల్ భువనగిరి.

● వాతావరణం మారడం వల్లే

వారం రోజులుగా వాతావరణం బాగా చల్లబడింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి గాలులు పెరిగాయి. పిల్లలు, వృద్ధులు, అస్తమా రోగులు జాగ్రత్తగా ఉండాలి. జలుబు, తద్వారా జ్వరం వస్తోంది. వేడినీళ్లు తాగాలి. అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూసుకోవాలి. జనరల్ ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైతే మందులు ఇస్తున్నాం. వైద్యులు, డ్యూటీ డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. ఎలాంటి ఇబ్బంది కలిగినా మమ్మల్ని సంప్రదించవచ్చు.

డాక్టర్ నగేశ్, డిప్యూటీ సూపరింటెండెంట్, నల్లగొండ జిల్లా కేంద్ర ప్రధానాసుపత్రి

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు

మేళ్లచెర్వు, ఆలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని కందిబండ జడ్పీహెచ్ఎస్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ ఎంపికయ్యారు. అసోం రాష్ట్రంలోని ఐఐటీ గౌహతిలో జరుగుతున్న ఈ నెల 30 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు న్యూఢిల్లీలోని జాతీయ పరిశోధన, శిక్షణ సంస్థ, కేంద్ర అణుశక్తి శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫెస్టివల్‌కు హాజరవుతున్నట్లు ఎంఈవో వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. సైన్స్ బోధన, నైపుణ్యాభివృద్ధి, ఉపాధ్యాయుల కార్యశాల అంశంలో జాఫర్ పాల్గొనున్నట్లు వారు తెలిపారు. జాఫర్‌ను పలువురు అభినందించారు.



జాఫర్

● యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీవశాస్త్రం ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి సైదులు కూడా సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెస్టివల్‌కు తనను ఎంపిక చేసి ఆహ్వానం పంపడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సైదులను ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్ పూల నాగయ్య, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారేంద్రస్వామి, ఉపాధ్యయులు పోరెడ్డి రంగయ్య, సత్యనారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



సైదులు

రేపటి నుంచి ఫుట్‌బాల్ అండర్-14 జట్ల ఎంపిక

ఆలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా ఈ నెల 29 నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక జరుగునుంది. అండర్-14 బాల, బాలికల క్రీడా జట్ల ఎంపిక కోసం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. మూడు జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి బెజ్జం బాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు. 2011 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 9000989671 ఫోన్ నెంబరులో సంప్రదించాలని వివరించారు.

సాగునీటి కాల్వలపై నజర్

(5వ పేజీ తరువాయి)


భారీ వర్షాలు కురవగానే యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ పరవళ్లు తొక్కుతుంది. ఈవరద నీటిని సాగునీటి కోసం వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కాల్వలను నిర్మించాలని 2003లో అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించింది. మొట్టమొదటిసారి ధర్మారెడ్డి కాల్వ నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించింది. ఈ నిధులతో రైతుల పొలాలు నష్టపోకుండా గెట్టు ద్వారా చెరువుల్లోకి నీరు మళ్లించారు. అయితే నీరు అధిక మొత్తంలో రావడంతో కాల్వ పరిధిని పెంచాలని ప్రతిపాదనలు సిద్ధంచేసి, మరో రూ.7లక్షలు మంజూరుచేసింది. అయితే వీటిలో కాల్వల నిర్మాణం పూర్తిచేశారు. అయితే కాల్వలకు తగినట్లు కల్వర్టులు నిర్మించకపోవడంతో నీరు చెరువుల్లోకి కాకుండా కత్వనుంచి నేరుగా వాగుల్లోకి వెళ్తుంది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ కాల్వలను పునరుద్ధరించి, 60వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2016లో కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కాల్వల ద్వారా భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, భువనగిరి, రామన్నపేట, చౌటుప్పల్, చిట్యాల, నకిరేకల్, మండలాలకు సాగునీరు అందుతుంది. 2017లో ఈ మూడు కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం రూ.284.85కోట్లు మంజూరుచేసింది. ప్రస్తుతం ఐదు మీటర్లుగా ఉన్న కాల్వను 10 మీటర్లుగా వెడల్పు చేయడంతోపాటు కాల్వర్టుల నిర్మాణం, భూసేకరణకు నిధులు కేటాయించింది. అయితే ఇప్పటివరకు కాల్వల్లో మట్టి తీశారే తప్ప, పూర్తిస్థాయిలో కల్వర్టులు నిర్మించలేదు. దీంతో ఇప్పటివరకు 61శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. కాల్వల పునరుద్ధరణకు మరో 40శాతం మేరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. గత ఆరేళ్లుగా ఈ కాల్వల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పనులు ముందుకు సాగడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి అలసత్వం ఫలితంగా గత ప్రభుత్వం కాంట్రాక్టును రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కాంట్రాక్ట్ రద్దు

యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లో చేపట్టిన పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి సాగునీటి కాల్వల పునరుద్ధరణ పనులకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను గత ప్రభుత్వం రద్దుచేసింది. కాల్వల పునరుద్ధరణ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ శాఖ షోకాజ్ నోటీస్ జారీచేసింది. ప్రభుత్వం చెల్లించే ధర తమకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్ వెల్లడించడంతో, స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సమీక్షించి, ముందస్తుగా కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మూడు కాల్వల పునరుద్ధరణ గానూ అసంపూర్తిగా ఉన్న పనులపై వేర్వేరుగా మరోసారి అంచనాలు రూపొందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 2017లో ధర్మారెడ్డి, బునాదిగాని, పిలాయిపల్లి కాల్వల నిర్మాణంకోసం ప్రభుత్వం రూ.284.85కోట్లు మంజూరుచేసింది. అప్పటివరకు 20వేల ఎకరాల ఆయకట్టునుంచి 60వేల వరకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈనిధుల్లో ధర్మారెడ్డి కాల్వకు రూ.65కోట్ల మేరకు కేటాయించింది. బునాదిగాని కాల్వకు రూ.100కోట్లు, పిలాయిపల్లి కాల్వకు రూ.119.58కోట్లు కేటాయించింది. భూసేకరణతో పాటు కాల్వల పునర్ధరణ, కల్వర్టుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించింది. ధర్మారెడ్డి కాల్వకు రూ.18కోట్ల, పిలాయిపల్లి కాల్వకు రూ.90 కోట్లు, బునాదిగాని కాల్వకు రూ.35కోట్ల మేరకు పనులు పూర్తయ్యాయి. అయితే గత ఆరేళ్ల నామమాత్రంగా పనులు చేపడుతున్నారే తప్ప..., పూర్తిస్థాయిలో పనులు చేపట్టడం లేదని రైతులు విమర్శలు వ్యక్తంచేస్తున్నారు. కాంట్రాక్టర్లు మారినప్పటికీ, కాల్వ పనులు 50శాతం కూడా పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాజాగా ఏర్పడిన ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణపై నూతనంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరింది. ఈ మేరకు అధికారులు అంచనాలు రూపొందించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

కాల్వలు పునరుద్ధరిస్తే 60వేల ఎకరాలకు సాగునీరు

పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వలు పునరుద్ధరించిన పక్షంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాల్లోని ఏడు మండలాల్లో 60వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. గత ప్రభుత్వాల అంచనాల ప్రకారం 50 క్యూసెక్కుల నీరు రైతుల పొలాల్లోకి వెళ్లేది. అయితే 2016లో ప్రభుత్వం కాల్వల పునరుద్ధరణతో 200 క్యూసెక్కులు అందించాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించారు. ధర్మారెడ్డి కాల్వను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తే వలిగొండ, భూదాన్ పోచంపల్లి, రామన్నపేట, చిట్యాల, నకిరేకల్ మండలాల్లోని 49 చెరువులు, కుంటలు నిండుతాయి. ఈ నీటితో మూడు మండలాల్లో 17,500ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఈ కాల్వ పొడవు మొత్తం 51కిలోమీటర్లకు గానూ 102 కల్వర్టులు నిర్మించాలి. పిలాయిపల్లి కాల్వ ద్వారా భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లో 18 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో 46 చెరువులు నిండనున్నాయి. ఈ కాల్వ ద్వారా 22,500 ఎకరాలకు సాగునీరందనుంది. బునాదిగాని కాల్వ 98 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ కాల్వ పునరుద్ధరిస్తే ఏడుమండలాల్లోని 93 చెరువులు నిండనున్నాయి. మొత్తం 20వేలకు పైగా ఎకరాల్లో సాగునీరందనుంది. పునరుద్ధరణ పనులు సంపూర్ణంగా అయితే రెండు జిల్లాల్లో 98కిలోమీటర్ల వరకు సాగునీరు అందే అవకాశం ఉంది.

> **నిధుల మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరాం**
>
> 
>
> ప్రభుత్వం బునాదిగాని కాల్వ పునరుద్ధరణ పనుల కోసం నిధులు మంజూరుచేసింది. అదేవిధంగా చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్న పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ పునరుద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్కలను కోరాం. త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణలో భాగంగా గతంలో చేపట్టిన పనులు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. అసంపూర్తిగా ఉన్న పనులకోసం నూతనంగా ప్రతిపాదనలు పంపాం. ఈ పనులకు నిధులు మంజూరు చేసి, రీటెండర్ వేసేందుకు చర్యలు తీసుకుంటుంది.
>
> భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు లిటిల్ ఫ్లవర్ విద్యార్థి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెనుగొండ ఏసన్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్ తెలిపారు. బుధవారం పాఠశాలలో మాట్లాడుతూ నల్లగొండలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సబ్‌జూనియర్ షాట్‌పుట్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఏసన్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. ఏసన్నను ఆయను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ నీలం రమేష్, హెచ్ఎం సుజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏసన్నను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మిర్యాలగూడ పట్టణ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. మెదక్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14 టోర్నమెంట్‌లో టీ.అక్షిత్‌రెడ్డి, ఆర్.కార్తీకేయ, బీ.తనీష్, డీ.కార్తీకేయ, ఎస్.శమంత్ ఉత్తమంగా రాణించి పతకాలు సాధించారన్నారు. క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, డీఎస్‌వో విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నవీన్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు



హాలియాలో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, హాజరైన మాలాధారులు, పడిని ముట్టిస్తున్న జైవీర్‌రెడ్డి

శబరిగిరీశా అయ్యప్ప..శరణం శరణం అయ్యప్ప

- హాలియాలో మహాపడిపూజ
- శోభాయమానంగా మంటప అలంకరణ
- భారీగా తరలివచ్చిన భక్తులు

హాలియా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా హాలియాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అయ్యప్ప మహాపడి పూజ కనివిని ఎరుగని రీతిలో, భారీ సెట్టింగ్ మంటపాల మధ్య శోభాయమానంగా నిర్వహించారు. తాంత్రిక స్వామి సత్యనారాయణ గురుస్వామి పడిపూజను చేపట్టారు. కొనసీమకు చెందిన రాజేష్ కళాబృందం ఆలపించిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శివుని అవతారంలో ఓ భక్తుడు ఉత్సాహపరిచారు. సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, సుమతి దంపతులు వేడుకల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జైవీర్ కుమారుడు శివారెడ్డి కూడా మాలవేసుకొని తండ్రితో పాటు పూజ నిర్వహించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పడిపూజకు పాల్గొన్నారు. స్వాము లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గురుస్వాములు మేడేపల్లి మోహన్‌రావు, గౌని రాజారమేష్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి ఏర్పాట్లు సమీక్షించారు.

మూడు వేల మంది స్వాములకు అల్పాహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీ అధ్య క్షుడు కేతావత్ శంకర్‌నాయక్, యడవెల్లి నరేందర్ రెడ్డి, నాయకులు కర్నాటి లింగారెడ్డి, మలిగిరెడ్డి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, రాజాప్రసాద్, చిట్టిపోలు యాదగిరి, చింతల చంద్రారెడ్డి, అంకతి సత్యం, ఆంజనేయులు, రామేశ్వరీ, ప్రవీణ్ రెడ్డి, సాగర్‌రెడ్డి, చంద్రశేఖర్, పబ్బు యాదగిరి, భాస్కర్‌నాయక్, కృష్ణనాయక్, పొదిల కృష్ణ, వెంపటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో వేంకటేశ్వరుడు



కృష్ణావతారంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి

వలిగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని సుంకిశాలగ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీమహావిష్ణువు అవతారాల్లో విశిష్టమైన శ్రీకృష్ణుడి అవతారంగా వేంకటేశ్వరుడు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. లోకకల్యాణర్థం, విశ్వశాంతికోసం నిర్వహిస్తున్న స్వామివారి బ్రహోత్సవాలు కన్నులపండువగా సాగాయి. ఆగమ శాస్త్రరీతిలో సంప్రదాయంగా ధ్వజారోహణం నిర్వహించారు. స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానించేందుకు శ్రీమహావిష్ణు వాహనం, గరుత్మంతుడిని ఆహ్వానించడానికి ధ్వజారోహణ తంతు నిర్వహించారు. గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభం పైకి ఎగురవేశారు. గరుడ ముద్దను ఎగురవేశారు. భేరీపూజ, దేవతాహ్వానం కన్నుల పండువగా సాగింది. నేడు 12గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణము వైభవంగా కొనసాగుతుందని వేంకటేశ్వరస్వామి సాంఘిక సంక్షేమ సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానాచార్యకులు సంతోష్‌కుమారాచార్యులు, షన్ముఖ స్వామి అర్చకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిలిచిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు
- క్రయవిక్రయదారుల ఇబ్బందులు




నల్లగొండ, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సర్వర్ డౌన్ కావడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఎదురయ్యాయి. బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే చలాన్ తీసుకొని స్లాట్ బుక్ చేసుకున్న వారికి అరకొరగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ వెయ్యికి పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, భువనగిరి, చౌటుప్పల్ కార్యాలయాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. రాష్ట్రస్థాయిలోని రిజిస్ట్రేషన్ శాఖలో చలాన్ల వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో చలాన్లు తీసుకోవడానికి సమస్యలు ఎదురయ్యాయి. ఆస్తుల క్రయవిక్రయదారులు వివిధ ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు జిల్లాల్లో కనీసం 40 డాక్యుమెంట్లు కూడా రిజిస్ట్రేషన్ కూడా కాలేదని సమాచారం. కొద్ది రోజుల క్రితం కూడా ఇదేవిధంగా సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు ఎదురయ్యాయి. తరుచూ రాష్ట్రవ్యాప్తంగా సర్వర్ డౌన్ అవుతూ రిజిస్ట్రేషన్ శాఖలో సేవలు నిలిచిపోతున్నాయి. మరుసటి రోజు అయినా రిజిస్ట్రేషన్ సేవలు అందుతాయా? లేదా? అనేది అధికారుల వద్ద కూడా సమాచారం లేని పరిస్థితి నెలకొంది.

పాస్‌పుస్తకాలు అందేదెప్పుడో?

- భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు అందని పాస్ పుస్తకాలు
- బ్యాంకు రుణాలు అందక రైతుల్లో ఆందోళన

రైతు భూమి తనదని నిరూపించు కోవడానికి పట్టాదారు పాస్ పుస్తకమే కీలకం. కొత్తగా వ్యవసాయ భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ఆరు నెలలుగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందడం లేదు. రిజిస్ట్రేషన్ అయ్యాక 15రోజుల్లో అందాల్సిన రావాల్సిన పట్టాదారు పాస్ పుస్తకాలు నెలల తరబడి రాకపోవడంతో కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో పెట్టుబడులు, వ్యవసాయ పరికరాల కోసం బ్యాంకుల్లో రుణం తీసుకోవడానికి వెళితే పట్టాదారు పాస్ పుస్తకం లేకుండా రుణం ఇవ్వడం కుదరదని వెనక్కి పంపుతున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మోత్కూరు, (ఆంధ్రజ్యోతి).



వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ సందర్భంగా భూమి మ్యుటేషన్‌కు భూమి విలువలో 0.50 శాతం చొప్పున ఫీజు, కొత్త పట్టాదారు పాస్ పుస్తకానికి రూ.300 చొప్పున భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్లాట్ బుక్ చేసినప్పుడే ప్రభుత్వం వసూలు చేస్తుంది. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత తహసీల్దార్ ప్రొసీడింగ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, డూప్లికేట్ పీపీ ఇస్తున్నారు. వాటి ఆధారంగా బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు.

పట్టాదారు పాస్ పుస్తకం ఉంటేనే ఇస్తామంటున్నారు. ఇది యాసంగి సీజన్. పెట్టుబడులకు రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి వెళితే పట్టాదారు పాస్ పుస్తకం లేకుండా రుణం ఇవ్వడం కుదరదని మేనేజర్లు వెనక్కి పంపుతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి భూమి కొనుగోలు చేస్తే అవసరానికి బ్యాంకులో రుణాలు తీసుకోలేక పోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పాస్ పుస్తకాలు పెండింగ్

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 మండలాలు, సూర్యాపేట జిల్లాలో 23 మండలాలు, నల్లగొండ జిల్లాలో 31 మండలాల చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 71 మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. గతంలో పాస్ పుస్తకం ఉన్నవారు భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వెంటనే అందులో నమోదు చేసేవారు. ఇప్పుడు కొత్తగా భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి వారం, పది రోజుల్లో కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం వస్తుందని అధికారులు చెప్పి పంపుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సగటున రోజుకు ఒక్కో తహసీల్దార్ కార్యాలయంలో 15కొత్త రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. మండలానికి నెలకు 15చొప్పున ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,065 రిజిస్ట్రేషన్లు జరుగు తాయి. ఆరు నెలలకు 6,390 రిజిస్ట్రేషన్లు అవుతుండగా, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు రాక వారు ఇబ్బందులు పడుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేలోనూ లెక్క తప్పుతోంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న సమగ్ర కుటుంబ సర్వేలో భూమి ఉంటే విస్తీర్ణం, పట్టాదారు పాస్ పుస్తకం నంబరు నమోదు చేస్తున్నారు. కొత్తగా భూమి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు పట్టాదారు పాసు పుస్తకం రాకపోవడంతో వారు సర్వేలో తమ భూమి నమోదు చేసుకోవడం లేదంటున్నారు. దీంతో మున్ముందు ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చినప్పుడు తమకేమైన ఇబ్బంది అవుతుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కారణం తెలియదంటున్న అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను మార్చి 'భూమాత'ను తెస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీ నిలిపివేసిందా, లేక పాస్ పుస్తకాల ముద్రణ సంస్థ సకాలంలో పాస్ పుస్తకాలు ముద్రించడం లేదా అన్న చర్చ జరుగుతోంది. రిజిస్ట్రేషన్ చేయించుకుని నెలలు గడుస్తున్నా పట్టాదారు పాస్ పుస్తకం ఎందుకు రావడం లేదని తహసీల్దార్లను అడిగితే కారణాలేమిటో తమకు తెలియదని సమాధానం ఇస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఐదు నెలలైనా పట్టాదారు పాస్ పుస్తకం రాలేదు



నా కుమారుడు సాయివంశీ పేరున గత జూలై 8న ఎకరం పది గుంటలు భూమి రిజిస్ట్రేషన్ చేయించా. కొత్త పట్టాదారు పాస్ పుస్తకానికి స్లాట్ బుకింగ్ రోజే రూ.300తీసుకున్నారు. ఇంతవరకు పట్టాదారు పాస్ పుస్తకం రాలేదు. వెంటనే పాస్ పుస్తకం ఇవ్వాలి.

- లెంకల వేణు, రైతు, కొండగడప.

బ్యాంకులో రుణం ఇవ్వడం లేదు



కొండగడపలో నాలుగు ఎకరాల భూమి కొని నా భార్య అంబటి రాములమ్మ పేరున రిజిస్ట్రేషన్ చేయించా. రిజిస్ట్రేషన్ చేసి రెండు నెలలు అయినా పట్టాదారు పాస్ పుస్తకం రాలేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు తహసీల్దార్ ఇచ్చిన ప్రొసీడింగ్, రిజిస్ట్రేషన్ డ్యాక్యుమెంట్ తీసుకెళ్లి మోత్కూరు రైతు సేవా సహకారం సంఘంలో రుణం కోసం వెళ్లితే పట్టాదారు పాస్ పుస్తకం లేనిది రుణం ఇవ్వమని చెప్పారు. బ్యాంకులో రుణం తీసుకుందామంటే పాస్ పుస్తకం లేదని ఇవ్వడం లేదు.

-అంబటి నర్సయ్య, రైతు, కొండగడప

పాస్ పుస్తకాలు రాక పోవడానికి కారణం తెలియదు

వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసినప్పుడు ప్రొసీడింగ్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, డూప్లికేట్ పీపీ ఇస్తున్నాం. పట్టాదారు పాస్‌పుస్తకం రైతు ఇంటి అడ్రస్‌కు వెళుతుంది. పట్టాదారు పాస్‌పుస్తకం ఎవరికి వచ్చింది, ఎవరి రాలేదు అని మాకు తెలియదు. కొందరు పాస్‌పుస్తకం రాలేదని అడుగుతున్నారు.

- డి.రాంప్రసాద్,తహసీల్దార్,మోత్కూరు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	210	240
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.10
టీఎంసీలు	305.5646
ఎడమకాల్వకు నీటి విడుదల	3431
కుడికాల్వకు	9047
విద్యుత్ కేంద్రం ద్వారా	25,416
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	40,594క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.33 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	560 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.38
ప్రస్తుత నీటి మట్టం	644.70 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	168.89 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	167.33 క్యూసెక్కులు

సహకార వ్యవస్థపై అధ్యయనం

- కర్ణాటక రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల పర్యటన



కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని నందినాథపురం సొసైటీ వద్ద ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు

నల్లగొండ, చిట్యాలరూరల్, హుజూర్‌నగర్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను అధ్యయనం చేసేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు అధ్యయన యాత్ర చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం వారు కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ జిల్లాలో ఉన్న నందినాథపురం పీఏసీఎస్‌ను సందర్శించారు. నందినాథపురం సొసైటీలో జరుగుతున్న అభివృద్ధిని తెలుసుకోవడంతో పాటు సొసైటీ బైలాలోని అంశాలను అధ్యయనం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండా సైదులు, జయరాం, రామచంద్రయ్య, గొల్లగూడ పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, హుజూర్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్లు సత్యనారాయణ, కోటిరెడ్డి, శంభిరెడ్డి, రామచంద్రయ్య, వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలికి వెళ్లిన భార్యపై కత్తితో దాడి

దేవరకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకొని మద్యానికి బానిసై భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పద్మట్‌పల్లి గ్రామంలో బుధవారం జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన కిన్నెర బాలరాజుతో అరుణకు 25 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, భార్య అరుణ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన బాలరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భార్యను అనుమానిస్తూ తరుచూ గొడవ పడుతుండేవాడు. బుధవారం మద్యం తాగిన బాలరాజు కత్తి తీసుకొని పత్తి కూలికి వెళ్లిన భార్య వద్దకు వెళ్లి కూలీల ఎదుటే గొడవపడ్డాడు. తీవ్ర ఆగ్రహంతో వెంట తెచ్చుకున్న కత్తితో భార్య గొంతు, చెవులపై దాడి చేశాడు. అరుణకు తీవ్ర రక్తస్రావమైంది. పక్కనే ఉన్న కూలీలు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అరుణను హుటాహుటిన 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అరుణ తమ్ముడు అనిల్ ఫిర్యాదు మేరకు బాలరాజును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉసురుతీసిన భూతగాదాలు



సామ్య (ఫైల్)

చందంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం యలమలమందలో ఈ సంఘటన జరిగింది. చందంపేట ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... చందంపేట మండలంలోని యలమలమంద గ్రామానికి చెందిన కేతావత్ సామ్యకు, అదే గ్రామానికి చెందిన కేతావత్ హనుమా, బానావత్ హనుమాలకు భూ వివాదాలు ఉన్నాయి. భూమి విషయంలో నాలుగేళ్లుగా పంచాయితీ నడుస్తోంది. పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకున్నా పొలాలు సాగు చేసే సమయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేతావత్ సామ్య, అతని ఇద్దరు కుమారులు మహేందర్, లోకేష్ బుధవారం తమకున్న రెండున్నర ఎకరాల భూమిలో వేరుశనగ సాగుకోసం దుక్కులు దున్నుతున్నారు. అదే సమయంలో గ్రామానికి చెందిన కేతావత్ హనుమా, బానావత్ హనుమా వారి అనుచరులు కేతావత్ సామ్య, అతని కుమారులపై కర్రలు, గొడ్డళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో సామ్య (50), అతని పెద్దకుమారుడు మహేందర్ తీవ్రంగా గాయపడగా చిన్న కుమారుడు లోకేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం దేవరకొండలోని ఆస్పత్రికి తరలించగా సామ్య(50) పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి పెద్దకుమారుడు మహేందర్ దేవరకొండలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సామ్య కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. సామ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పూజలు చేస్తామని కారులో తిరుగుతూ..

మోత్కూరు, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): పూజలు చేస్తాం, తాయత్తులు కడతామంటూ యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు కారులో తిరుగుతున్న వీడియో ఒకటి బుధవారం సోషల్ మీడియాలో వైరలైంది. ఓ వీధిలో కారులో తిరుగుతున్న వ్యక్తులను చూసి పట్టణవాసి ఎవరు మీరు అని ప్రశ్నించగా తాము పూజలు చేస్తాం, బాగులేకుంటే బాగు చేస్తామని కారులో ఉన్నవారు చెప్పారు. ఎక్కడ పూజలు చేస్తారు, ఎవరికి బాగు చేస్తారని నిలదీయడంతో కారును వెనక్కు తిప్పుకుని వెళ్లి పోయారు.

యాదగిరిగుట్టలో ఘనంగా నిత్యకైంకర్యాలు

భువనగిరి అర్బన్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్య పూజలు, సత్యదేవుని వ్రతాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన ఆలయంలో స్వామి అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూవులు, సువర్ణ ప్రతిష్ఠమూర్తులను అభిషేకించి తులసి దళాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు. కొండకింద వ్రత మండపాల్లో సత్యదేవుని వ్రతాలు, కార్తీక మాసం పురస్కరించుకొని కొండపైన ఉత్తర ఎదురుగా శివాలయం, కొండకింద లక్ష్మీపుష్కరిణి సత్యదేవుని వ్రత మండపాలు వైకుంఠ ద్వారం వద్ద మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం చేపట్టి గజవాహన సేవలో ఊరేగింపు విశ్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. ముఖమండపంలో దర్బారు సేవోత్సవం నిర్వహించిన అర్చకులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.30,79,967ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ భాస్కర్‌రావు తెలిపారు.



తిరుమాఢ వీధుల్లో స్వామివారి సేవ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



శేషగిరిరావు(ఫైల్)

కోదాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన తాళ్ళూరి శేషగిరిరావు(72) తన భార్యను విజయవాడ పంపేందుకు గోండ్రియాల నుంచి బైక్‌పై కోదాడ మండలంలోని చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్దకు వచ్చాడు. ఆమెను విజయవాడ బస్సు ఎక్కించిన తర్వాత రోడ్డు పక్కన నిల్చుని ఫోన్‌లో మాట్లాడుతుండగా, హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టీఎస్09జి21జీ నెంబర్ గల కారు ముందుగా టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఢీకొని, తర్వాత రోడ్డు పక్కన ఉన్న శేషగిరిరావును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శేషగిరిరావు అక్కడికక్కడే మృతిచెందాడు. శేషగిరిరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శేషగిరిరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శేషగిరిరావు అల్లుడు యర్నేని శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా టీవీఎస్ ఎక్స్ఎల్‌పై ఉన్న ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని వల్లభి గ్రామానికి చెందిన పిల్లుట్ల వెంకటేశ్వర్లు, అతని భార్య జయమ్మలకు కూడా గాయాలయ్యాయి.

ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని..



నజీర్‌బాబా మృతదేహం

మోతె,(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న ట్రాలీ లారీని అతివేగంతో వెనకాల నుంచి బైక్‌పై వచ్చి బలంగా ఢీకొట్టి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని మామిళ్లగూడెం సింగరేణిపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన షేక్ నజీర్‌బాబా(40) మంగళవారం ఉదయం కుడకుడ నుంచి బైక్‌పై ఖమ్మంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా టోల్‌గేట్ పక్కన రోడ్డు వెంట ఆగి ఉన్న పెద్ద ట్రాలీ లారీని అతివేగంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. లారీ వెనకాల బైక్ ఇరుక్కుపోయిన నజీర్‌బాబా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నజీర్‌బాబాకు భార్య కుమారుడు ఉన్నాడు. భార్య షేక్ ఖైరున్నీసా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని..



మధు(ఫైల్)

మునుగోడు రూరల్, (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చీకటి మామిడి గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి చెందిన కామల్ల మధు(24) మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేసేవాడు. రోజు మాదిరిగానే పని ముగించుకొని మంగళవారం రాత్రి తన స్వగ్రామానికి బైక్‌పై వేగంగా వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుని ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మధును స్థానికులు గుర్తించి 108అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. మధు తల్లి పార్వతమ్మ ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి గాయాలు

అడ్డగూడూరు, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామానికి చెందిన తలపాక యాదయ్య గ్రామంలో జరిగిన అంత్యక్రియాల్లో పాల్గొన్ని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా చౌళ్లరామారం గ్రామ శివారులోని గిడ్డంగుల గోదాం వద్ద మోత్కూరు నుంచి తిరుమలగిరి వైపునకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన యాదయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా జిల్లా తిరుమలగిరి మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నల్లగొండ పట్టణంలో 'ఆపరేషన్ చభుత్రా'

- 48 బైక్‌లు, ఐదు కార్లు, మూడు ఆటోలు, 80 సెల్‌ఫోన్లు స్వాధీనం
- 80 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నల్లగొండలో అర్ధరాత్రి తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నల్లగొండ క్రైం, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారికి అడ్డుకట్ట వేసేందుకు నల్లగొండ జిల్లా పోలీసులు మంగళవారం అర్ధరాత్రి జిల్లాకేంద్రంలో ఆపరేషన్ చభుత్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు సీఐలు, 12మంది ఎస్ఐలు, 80 మంది కానిస్టేబుళ్లతో కలిసి పది బృందాలుగా ఏర్పడి 10 పెట్రోలింగ్ పార్టీల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణాన్ని అష్టదిగ్బంధనం చేశారు. అర్ధరాత్రి సమయంలో వాహనాలపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 84మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 48 బైక్‌లు, 5 కార్లు, మూడు ఆటోలు, 80 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 24మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి అరుగుల(చభుత్ర) మీద బాతకానీలు కొడుతూ, బైకులతో రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతూ కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలపై తిరిగి గొడవలు సృష్టించినా, అనుమానాస్పదంగా తిరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇక నుంచి తరుచూ ఇలాంటి డ్రైవ్‌లను నిర్వహిస్తామని తెలిపారు. నల్లగొండను నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి పట్టణవాసులు సహకరించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వారందరినీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని టీటీఐ సెంటర్‌లో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియల్, దూది రాజు, కొండల్‌రెడ్డి, ఎస్ఐలు రావుల నాగరాజు, సురేష్, సైదాబాబు, తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా తిరిగితే చర్యలు : ఏఎస్పీ రాములు నాయక్

కారణం లేకుండా అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై తిరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రాములునాయక్ హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని టీటీఐ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. అర్ధరాత్రి అరుగుల మీద బాతకానీలు కొడుతూ బైక్‌లపై రోడ్లపై ఇష్టానుసారంగా తిరుగుతూ, కాలనీ వాసులకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.

క్యాంపస్ సమాచారం

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు యథాతథం

నల్లగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 28 నుంచి జరగాల్సిన డిగ్రీ పరీక్షలు యథాతథంగా నిర్వహిస్తారని యూనివర్సిటీ సీవోఈ జి.ఉపేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షలపై ఎలాంటి వదంతులు నమ్మవద్దని కోరారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే పీడీ యాక్ట్

- రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ



ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యంతో కొందరు అక్రమార్కులు వ్యాపారం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏజెన్సీ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని తక్కువ ధరకు కొనుగోలు జిల్లా సరిహద్దులు దాటి చేసి ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు హెచ్చరించారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామంటున్న ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పీడీఎస్ బియ్యం వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తారా?

డీఎస్పీ : ప్రభుత్వం పేదలకు ఇస్తున్న బియ్యాన్ని కొందరు కొనుగోలు చేసి వాహనాల ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యాపారులు వేర్వేరు మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నారు. పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసి ఎస్పీ ఆదేశాలతో ఇద్దరిపై రౌడీషీట్ ఓపెన్ చేశాం. రేషన్‌బియ్యం అక్రమ రవాణా కేసులో మూడు కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఎస్పీ: యువతను నిర్వీర్యం చేసే మాదకద్రవ్యాల సరఫరాను అరికట్టేందుకు రిమోట్ ఏరియాల నుంచి నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాం. గంజాయి తీసుకునే వారిని గుర్తించి సుమారు 80మంది వరకు కౌన్సిలింగ్ ఇచ్చాం. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా చేసే 36 మందిని అరెస్ట్ చేశాం మొత్తం 16 కేసుల్లో 180 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నాం. సుమారు 600 షీట్ల మత్తు ట్యాబెట్లు కూడా పట్టుబడి చేశాం.

ఆంధ్రజ్యోతి: సరిహద్దు రవాణాపై నిఘా ఎలా కొనసాగిస్తున్నారు?

డీఎస్పీ: డివిజన్ పరిధిలో వాడపల్లి, నాగార్జునసాగర్ నుంచి సరిహద్దు రవాణా మార్గాలు ఉన్నాయి. సాగర్‌లో పర్మినెంట్ చెక్‌పోస్టు ఉంది. పోలీస్‌స్టేషన్ కూడా రహదారిపైనే ఉండడంతో తరుచూ వాహనాల తనిఖీ కొనసాగుతుంది. వాడపల్లి మార్గంలో వేములపల్లి వరకు రహదారిపై పోలీస్‌స్టేషన్ లేనందున అక్రమార్కులు ఈ రహదారిపై అక్రమ రవాణా చేస్తున్నారు. ఆంధ్ర రాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుని నిఘా కొనసాగిస్తున్నాం. అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ఇటీవల పశువుల అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలను కూడా పట్టుకున్నాం.

డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలి : ఆర్డీవో

భువనగిరి టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలని ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు. భువనగిరి మునిసిపల్ పరిధిలో సాగుతున్న డేటా ఎంట్రీని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి వివరాన్ని జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని ఆపరేటర్లకు సూచించారు. తుది ఫారం ఎంట్రీ పూర్తయ్యే వరకు అధికారుల పర్యవేక్షణ కొనసాగాలన్నారు. డేటా ఎంట్రీపై సమీక్షించారు. మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో కుటుంబాల నమోదుకు మరో అవకాశం

చౌటుప్పల్ టౌన్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో నమోదు చేసుకోని కుటుంబాల కోసం మరో అవకాశం కల్పించినట్లు మునిసిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో సర్వేలో వివరాలు నమోదు చేయని వారు సెల్ నంబర్ 9848391286 సంప్రదిస్తే ఎన్యూమరేటర్లు మీ ఇంటికి వస్తారని ఆయన తెలిపారు.

బోగస్ సర్టిఫికెట్ల ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి

భువనగిరి (కలెక్టరేట్),నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, సిబ్బంది బోగస్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నారని పూర్తి విచారణ చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏవో సి.జగన్‌మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు వస్తువుల అభి లాష్,ఉప్పల శాంతికుమార్ మాట్లాడుతూ భువనగిరిలోని బాలసదనంలో ఇటీవల జరిగిన ఘటన అత్యంత దారుణమని నిర్లక్ష్యం వహించిన ఇద్దరు సిబ్బందిని తొలగించినా పీవోఐసీగా పనిచేస్తున్న అలివేలు బోగస్ సర్టిఫికెట్లతో విధులు నిర్వహిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు దాసరి లక్ష్మయ్య, చందు, లోకేష్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి



గుట్టలో మండలాధ్యక్షుడికి నియమాక పత్రం అందజేస్తున్న సోమన్న

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి పతనం తప్పదని ఎంఎస్‌పీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కందుకూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బోడ అనిల్ అన్నారు. గుట్టలో బుధవారం ఏర్పాటు చేసిన ఆసంఘం ముఖ్యుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 21న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లాఅధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, నాయకులు మందశంకర్, బూడిద జాని పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ కార్యవర్గం ఎన్నుకున్నారు.

మహిళా క్రీడాకారులకు సన్మానం

అడ్డగూడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన త్రో బాల్ పోటీల్లో మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచారు. వారిని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ఎంపీటీసీ పాశం యాదమ్మా సత్యనారాయణ సన్మానించారు. వారికి మోమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిత్తాలూరి సోమన్న, సింగిల్ విండో డైరక్టరు వేముల భిక్షం, మాజీ సర్పంచ్ చిప్పలపల్లి బాలు పాల్గొన్నారు.

మణికంఠకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందన



మణికంఠను అభినందిస్తున్న మంత్రి పొన్నం

చౌటుప్పల్ టౌన్, వలిగొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ యూనివర్సిటీలోని సెంట్రల్ కౌన్సిలర్ పదవికి ఎన్నికైనలా విద్యార్థి బైరు మణికంఠ గౌడ్‌ను రాష్ట్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం అభినందించారు. సెంట్రల్ కౌన్సిలర్ పదవులకు ఈ నెల 24న ఎన్నికలను నిర్వహించగా సౌత్ ఇండియా నుంచి మణి కంఠ ఒక్కరే విజయం సాధించడం విశేషం. ఢిల్లీ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన మణికంఠ ప్రస్తుతం లా చదువు తున్నాడు.. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన మణికంఠగౌడ్ తల్లిదండ్రులు వెంకటేశం-హైమావతి 4 ఏండ్ల క్రితం చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లక్కారం సుందరయ్య కాలనీకి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. వెంకటేశం ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు.

పిలాయిపల్లి బాధితులకు అండగా ఉంటాం

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన ఆదివాసి ఎరుకుల కుటుంబాలకు అండగా ఉండాలని కోరుతూ ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్యను కోరారు. ఈమేరకు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని కూతాటి ప్రేమలత, యాదగిరి పూరిగుడిసెను కూల్చేసిన సంఘటనలో బాధితులకు అండగా ఉండి, నిందితులను వెంటనే రిమాండ్‌కు పంపాలని కోరారు. అందుకు ఆయన స్పందిస్తూ స్థానిక కలెక్టర్‌కు, డీజీపీ, ఏసీపీకి ఫోన్ ద్వారా తక్షణమే నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించారని సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు కుతాడి సురేష్, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ సదానందం పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేత

తుర్కపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలం ముల్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం దాతలు గుగులోతు మహేందర్, శ్రీకాంత్, గుండెబోయిన బాలమల్లేశ్ సహకారంతో విద్యార్థులకు ఆట వస్తువులు, స్కూల్ యూనిఫాం, కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ తక్యుద్దీన్ మాట్లాడారు. దాతలు ముందుకొచ్చి చేయూత నివ్వడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ ఎం రాపెల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మంజుషారాణి, పి. నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం



భువనగిరిలోని అయ్యప్ప ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భువనగిరి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలోని హరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో మండల పడి పూజ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిష్ఠమూర్తికి అభిషేక పూజలు చేసి హోమాలు చేశారు. అయ్యప్ప దీక్షా పరుల శరణు ఘోషతో పరిసరాలు దద్దరిల్లింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నూనె వెంకటేశం, దిడ్డి సత్యం, వ్యాపారవేత్త దిడ్డికాడి నర్సింగ్‌రావు, కౌన్సిలర్ దిడ్డికాడి భగత్, రాములు, శ్రీను ,లక్ష్మయ్య, పాల్గొన్నారు.

● చౌటుప్పల్ టౌన్ : స్థానిక అయ్యప్ప ఆలయంలో బుధ వారం దీపోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చౌటుప్పల్ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని మంజుల కమిటీ ప్రతినిధులు బి.సంధ్య, సువర్ణ, జయశ్రీ, శైలజ, వెంకటమ్మ, నికిత, రేవతి, ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణారావు, అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళి, అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లో లెవల్ కల్వర్టు

» అనాజీపురం - రావిపహాడ్ గ్రామాల వంతెనపై దెబ్బతిన్న రక్షణ దిమ్మెలు » ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రక్షణ దిమ్మెలు లేకుండా లో లెవల్ కల్వర్టు

కల్వర్టుపై గుంత

భువనగిరి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనాజీపురం, రావిపహాడ్ గ్రామాల మధ్య ఉన్న లో లెవల్ కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. కల్వర్టుపై ఉన్న రక్షణ దిమ్మెలు ధ్వంసం కాగా, గుంతలు పడడంతో వాహన దారులు పడుతున్నారు. మండలంలోని అనాజీపురం నుంచి బీబీనగర్ మండలం జంపల్లి గ్రామానికి వెళ్లేందుకు 30 ఏళ్ల క్రితం ఈ కల్వర్టు నిర్మించారు. అయితే వర్షాకాలంలో కల్వర్టుపై మూసీ వాగు ఉధృతంగా ప్రవహించడంతో మోకాలు లోతు వరద నీరు ప్రవహి ంచడంతో జిల్లా కేంద్రం నుంచి అనాజీపురం మీదుగా ప్రయాణించాల్సిన వాహనాదారులు రెడ్డి నాయక్ తండా, పచ్చర్లబోర్డు తండా, జంపల్లి, ముగ్దుంపల్లి, రావిపహాడ్, మాదారం, సిరివేణికుంట గ్రామాలకు వెళ్లే ప్రజలు 20 కిలోమీటర్ల మేర దూర ప్రయాణంతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆ రహదారి గుండా వెళ్తున్న బైక్ కల్వర్టుపై నుంచి వెళ్తున్న వరద ప్రవాహంలో కొట్టుకు పోయి గల్లంతై ఓ వ్యక్తి మృత్యువాత పడి మరో వ్యక్తి క్షేమంగా బయట పడ్డాడు. జంపల్లి, రెడ్డి నాయక్ తండా, రావిపహాడ్ తండా, మాదారం గ్రామాలకు చెందిన దాదాపు 100మంది విద్యార్థులకు పైగా అనాజీపురం జడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. మార్గ మధ్యలో కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని విద్యార్థులు తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించి కల్వర్టు వంతెనను ఎత్తుగా పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మూసీ వాగు వస్తే ప్రమాదం



అనాజీపురం, జంపల్లి గ్రామాల మధ్య కల్వర్టుపై ఇరువైపులా రక్షణ దిమ్మెలు శిథిలావస్థకు చేరాయి. మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తే ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుపై రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాదారులకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు ఎత్తును పెంచి గ్రామస్తుల ఇబ్బందులు తొలగించాలి.

\- లింగస్వామి,అనాజీపురం,భువనగిరి మండలం

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం



అనాజీపురం, జంపల్లి గ్రామాల మధ్యలో గల మూసీ వాగుకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు, కల్వర్టు మరమ్మతులకు నాన్ ప్లానింగ్ గ్రాంట్ కింద రూ.8 కోట్ల నిధులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

\- సైదులు, ఆర్అండ్‌బీ ఏఈ, భువనగిరి.

రేపటి నుంచి జిందాస మాదర్ సాహేద్ దర్గా ఉర్సు

ఆలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి బైపాస్‌లో ఉన్న రామసముద్రం వద్ద ఉన్న అస్తాన హజ్రాత్ సయ్యద్ హైమాద్ బాదీ యుద్దీన్ పీస్ కుత్‌బుల్లా జిందాస మాదర్ సాహేద్ దర్గా ఉర్సు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉర్సు నిర్వాహకుడు మధుకుమార్ (మదర్) బుధవారం తెలిపారు. పట్టణంలోని కాటమయ్య నగర్‌లోని తన నివాసం నుంచి దర్గా వరకు గంధం ఊరేగింపు మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు చెప్పారు. 30న దర్గా వద్ద రాత్రి దీపారాధన 1న మధ్యాహ్నం ప్రార్థన (జీకార్) ఉంటుందని వివరించారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

టీపీఎస్ఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఆలేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కొందరు సెక్రటేరి యల్ ఫోరం నుంచి బయటకు వెళ్లి కొత్తగా టీపీఎస్ఎఫ్ సంఘం ఏర్పాటు చేసుకొని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేతావత్ సర్వర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా మామిడిగల ఇందిరా, జనరల్ సెక్రటేరియల్‌గా కందుకూరి కనకరాజు ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గ జాబితాను స్థానిక ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్‌కు అందజేశారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి

ఆత్మకూరు(ఎం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎదలో ఉన్న పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని మండల పశువైద్యాధికారులు గిరి, సంతోష్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని రాఘవాపురంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పశు సంవర్థక శాఖ సహకారంతో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి అవస రమైన చికిత్స చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ రవీందర్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● రాత్రి నిద్ర చేసిన అధికారులు



మోత్కూరులో బీసీ బాలికల హాస్టల్ తనిఖీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆదేశాల మేరకు జిల్లా, మండల అధికారులు మండలాల్లోని సంక్షేమ హాస్టళ్లను బుధవారం రాత్రి తనిఖీ చేసి అక్కడే నిద్రించారు. అక్కడ సమస్యలను తెలుసుకొని నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు చెప్పారు.

● మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు బీసీ బాలికల హాస్టల్‌ను మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తనిఖీ చేశారు. వంట గది, వంటలు, మూత్రశాలలు పరిశీలించారు. అక్కడి సమస్యను తెలుసుకున్నారు. మాట్రిన్ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హాస్టళ్లలో పరి శుభ్రతను పాటించాలని సూచించారు. ఇదే హాస్టల్‌ను ఈ నెల 26న (మంగళవారం) ఇదే కమిషనర్ శ్రీకాంత్ సందర్శించినప్పుడు నలుగురు విద్యా ర్థినులు మాత్రమే ఉండగా, బుధవారం 28 మంది విద్యార్థి నులు ఉన్నారు. తహసీల్దార్ డి.రాంప్రసాద్ ఎస్సీ బాలికల హాస్టల్‌ను, ఎంఈవో టి.గోపాల్‌రెడ్డి ఎస్సీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లలో అధికారులు రాత్రి నిద్ర చేశారు

● వలిగొండ : మండంలోని లోతుకుంట గ్రామ ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని హాస్టల్ నిద్రలో భాగంగా బుధ వారం రాత్రి మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శిం చారు. హాస్టల్‌లో విద్యార్థుల ఆరోగ్యం, భోజనం, పరిసరాల పరిశుభ్రతపై ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

● మోటకొండూరు :మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీడీవో ఇందిరా, ఎస్సీ బాలుర వసతి గృహంలో డీసీఓ శ్రీధర్ నిద్ర చేశారు. ఈసందర్భంగా సాయంత్రం వసతి గృహలకు చేరుకుని వంట గదిలోని బియ్యం, కూరగాయలు, చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యతను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులో కలిసి వసతి గృహంలో నిద్ర చేశారు. వారి వెంట ప్రిన్సిపాల్ జ్యోతి ఉన్నారు.

● భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి తహసీల్దారు మహేందర్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా పెట్టాలి : ఆర్డీవో



భూదాన్‌పోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఆర్డీవో శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్, పీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలను రుచి చూశారు. అనంతరం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే వివ రాల నమోదు ప్రక్రియను ఆర్డీవో పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రావర్తి భాస్కర్, తహసీల్దారు మహేందర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ నాగేశ్వర్ రావు, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాజాపేట : మండలం దూదివెంకటపూర్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి, రాజా పేట మండల ప్రత్యేక అధిరారి శ్యాంసుందర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పప్పు, కూరలు పలుచగా ఉండడంతో ఏఎన్‌సీ సభ్యులను మందలించారు. ఆయన వెంట ఎంఈవో చందా రమేష్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను కలిసిన కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం),నవంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరు తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వై.లక్ష్మారెడ్డి, ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బత్తిని ఉప్పలయ్య బుధ వారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే మండలంలో రూ. కోటి నిధులతో పలు అభివృద్ధి పనులకు త్వరలోనే శంకు స్థాపన చేస్తానని హామీ ఇచ్చినట్లులక్ష్మారెడ్డి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనకబండ గ్రామానికి చెందిన బత్తిని మురళి అనారోగ్యంతో ప్రైవేటు దవాఖానాలో చికిత్స చేయించుకున్నాడు. అతడికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.20వేల సీఎం సహాయ నిధి చెక్కును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య బుధవారం లబ్ధిదారుడు మురళికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాధారపు మల్లేష్, ఎస్.వెంకటేష్, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మోత్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. బుధవారం మోత్కూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు ఆయన ప్రశ్నాపత్రాలు అందజేసి మాట్లాడారు. అనంతరం టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అంద జేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి, సుబ్రహ్మణ్యశర్మ, వెంకటాచారి, ఓ.సత్యనాథ్, ఆనంద్‌కుమార్, నర్సింహులు, సరోజ, మధుకర్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అడ్డగూడూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శీతాకాలంలో వచ్చే సమస్యలు ఊపిరితిత్తులు సమస్యలు (ఆస్త మా) గొంతునొప్పి, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, జ్వరం, మలేరియా, డెంగ్యూ టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాల్వలను పూర్తి చేసి సాగు జలాలను అందించాలి : సీపీఎం



ఆలేరు రూరల్ : కాల్వలను పరిశీలించి మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

ఆలేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మండలంలో నిర్మించిన కాల్వలను పూర్తి చేసి సాగు జలాలను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. మండలంలోని టంగుటూరు, పటేల్‌గూడెం గ్రామాల్లో 15 సంవత్సరాల క్రితం నిర్మించిన అసంపూర్తి కాల్వలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు ప్రాంతానికి సాగు జలాలు అందించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజు, దూపటి వెంకటేష్, ఎంఏ ఇక్బాల్, సత్యరాజయ్య, తులసయ్య, దాసి శంకర్, మల్లేశం, ఉప్పలయ్య, మల్లిఖార్జున్ అశోక్ ఉన్నారు.

● చౌటుప్పల్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలో డిసెంబరు 15, 16, 17 తేదీల్లో నిర్వహిం చనున్న సీపీఎం జిల్లా మహాసభల కరపత్రాలను బుధవారం స్థానికంగా విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, పట్టణ, మండల కార్యదర్శులు గోశిక కరుణాకర్, గంగదేవి సైదులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. నర్సింహ, బి.అనురాధ, బూరుగు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, దండ అరుణ్ కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీరిక సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డు ఇవ్వాలి

ఆలేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు, తెలుపురంగు రేషన్‌కార్డు వెంటనే ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఇక్బాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15 నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభలు బహిరంగ సభ జయప్రదం చేయాలని ఆలేరులోని సుభాష్‌నగర్, మహాలక్ష్మీ రైస్‌మిల్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, మురిగాడి అజయ్, వడ్డెమాన్ విప్లవ్, భువనగిరి గణేష్, కాసుల నరేష్, నవీన్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలి : బీజేపీ

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ తయారికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రామాజీపేట గ్రామ సమీపంలోని యాదాద్రి లైఫ్ సైన్సెస్ ఫార్మాటికల్ కంపెనీ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 25న గూడూరు టోల్‌గేట్ వద్ద 120 కిలోల నిషేధిత డ్రగ్స్‌ను పట్టుకోవడంలో గుట్టలో సంచలనం సృష్టించిందని, ప్రముఖ పుణ్యక్షేత్రంలో డ్రగ్స్ తయారు కావడం ఏమిటి ప్రశ్నించారు ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని కంపెనీ సీజ్ చేయాలని కోరారు.నిషేధిత డ్రగ్స్ తయారిలో పెద్దల హస్తం ఉందని లేకుంటే ఇంతపెద్దఎత్తున తయారు సాధ్యం కాదని గత పాలకులు, ప్రస్తుత పాలకుల సైతం ఇందులో ప్రమేయం లేకపోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సత్తయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

చౌటుప్పల్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):చౌటుప్పల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెరుకు సత్తయ్య ఇటీవల మృతి చెందారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా సత్తయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు పబ్బు రాజు, సుర్వి నర్సింహ, మొగుదాల రమేష్, ఆకుల ఇంద్రసేనా రెడ్డి, బోయ దేవేందర్, చెరుకు లింగస్వామి, పాండు, కరీం ఉన్నారు.


పదో తరగతి విద్యార్థుల ఫీజు చెల్లింపు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్ష ఫీజు మొత్తాన్ని మాజీ సర్పంచు, బండి దయాకర్ చారిటుల్ ట్రస్ట్ ప్రతినిధి బండి కృష్ణగౌడ్ అందజేశారు. బుధవారం పాఠశాలలో హెచ్ఎం గురునాథం కలిసిన పరీక్ష ఫీజు చెల్లించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వందన, హనుమంత్‌రెడ్డి, శైలజ, విద్యార్థి నాయకులు ఎర్ర విక్రమ్, రేవెల్లి అశోక్, బుచ్చిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి గంజ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భువనగిరి పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా వినాయక చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఇరువైపులా 11 కేవీ లైన్ మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు భువనగిరి పట్టణంలో కృష్ణ జ్యువెలరిస్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, ఆర్బి నగర్, వీరభద్ర షాపింగ్‌మాల్, హనుమాన్ వాడ, సంజీవనగర్, రోడ్డులో సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ వైస్‌చైర్మన్ దశరథ

భువనగిరి టౌన్, నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లందుకు బీజేపీ ఆధ్వర్యంలో యాత్రలు చేపడుతున్నట్లు యాత్రల భువనగిరి అసెంబ్లీ ఇన్‌చార్జి, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయదశరథ అన్నారు. భువనగిరిలో బుధవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 1, 2, 3 తేదీల్లో నియోజకవర్గంలో బైక్ ర్యాలీలు, 4న బహిరంగ సభలు, 5న ఎమ్మెల్యే వైఫల్యాలపై చార్జ్‌షీట్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్త, నాయకులు చంద్ర శేఖర్, సురకంటి జంగారెడ్డి, పడమటి జగన్మోహన్‌రెడ్డి, నర్ల నర్సింగ్‌రావు, పట్నం శ్రీనివాస్, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, వైజయంతి, రత్నపురం బలరాం, చీర్క సురేష్‌రెడ్డి, డీఎల్ఎన్‌గౌడ్, పట్నం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటు

యాదగిరిగుట్ట రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఇప్పటి వరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి మల్లేశం ఆరోపించారు. గుట్టలో బుధవారం జరిగిన పార్టీ ఆలేరు నియోజకవర్గం స్థాయి ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ నెల 30 నుంచి డిసెంబరు 5వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిత్రజ నరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జహంగీర్, కానుగంటి శ్రీనివాస్‌రెడ్డి, కాదూరి అచ్చయ్య, చిరిగె శ్రీను, కృష్ణమాధురి, కాశీనాథ్, కర్రె ప్రవీణ్, గుంటిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.